క్లుప్తంగా

నేత్రదానం..

మధిర: పట్టణానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా వారి నేత్రాలను వారి కుమారుడు సుధాకర్ ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు గురువారం ఆయన నివాసంలో ప్రశంసాపత్రం, మెమెంటోలను ఖమ్మం నేత్రనిధి బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు వాసిరెడ్డి రామనాథం, ఖమ్మం జిల్లా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఇరుకుళ్ల లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, రాధాకృష్ణ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన ఏర్పాటు

మధిర: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం మధిరలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వైరా నదిపై గురువారం తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మధిర మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, కౌన్సిలర్లు మేడికొండ కళ్యాణి కిరణ్, తొగరు లక్ష్మీఓంకార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, శాశ్వతమైన వంతెన నిర్మాణంతో మధిర, మడుపల్లిని కలిపేందుకు కృషి చేస్తామని వైస్ చైర్ పర్సన్ విద్యాలత తెలిపారు.

మృత్యుంజయ స్వామిని దర్శించుకున్న అఘోరాలు

మధిర: పట్టణంలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయాన్ని గురువారం అఘోరాలు దర్శించుకున్నారు. ఉజ్జయిని నుంచి వాహనంలో వారణాసికి వెళ్తున్న ముగ్గురు అఘోరాలు శ్రీ మృత్యుంజయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆశీర్వచనం అందుకున్నారు.

వాయు శివలింగం, జ్యోతిర్లింగ దర్శనం

కల్లూరు: మహాశివరాత్రి సందర్భంగా ద్వాదశి జ్యోతిర్లింగాల నమూనాలను భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేస్తున్నట్లు బ్రహ్మకుమారీలు తెలిపారు. పట్టణంలోని కప్పలబంధం రోడ్డులో 20 అడుగుల వాయు లింగం, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుందని బ్రహ్మకుమారీ మహేశ్వరి, సభ్యులు శ్రీకాంత్, శిరీష, కాటమనేని రమణయ్య, వి.సోమేశ్వరరావు వెల్లడించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొణిజర్ల: మండలంలోని సిద్దిక్‌నగర్ గ్రామంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శీలం రంగారెడ్డి దంపతులు, గోరింట కిషోర్, రవి దంపతులచే హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

సత్తుపల్లిలో హనుమాన్ చాలీసా పారాయణం

సత్తుపల్లిటౌన్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏకాదశి సందర్భంగా పట్టణంలోని మువ్వా గోపాలరావు – సునీత నివాసంలో గురువారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, భగవత్‌గీత సంక్షేప పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, హైమావతి, లత, రమాదేవి, లక్ష్మీ, సరోజిని, స్రవంతి, సుధారాణి, ఆళ్ల మురహరి పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఉన్నత పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అల్పాహారం కార్యక్రమాన్ని బుధవారం సొసైటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి కృష్ణయ్య, పాఠశాల శాశ్వత కమిటీ అధ్యక్షుడు కొడిమెల అప్పారావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధనుంజయ్, హెచ్‌ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్ సురేష్

తల్లాడ: మండలంలోని నారాయణపురం లూర్దుమాతా పుణ్యక్షేత్రం 25వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మూడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను లూర్దుమాతా విచారణ గురువులు సురేష్ ప్రారంభించారు. వైరా, తల్లాడ, ఏన్కూరు మండలాల స్థాయిలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తల్లాడ సర్పంచ్ సంధ్యారాణి ఇస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవి, చార్లెస్, ప్రసాద్, దామస్, ధోనేష్, రఘు, నాగులు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

పన్ను 'పంచాయితీ'

ఇంటి పన్నుల వసూళ్లలో సత్తుపల్లి ఎనిమిదో స్థానం

- 90శాతంతో మొదటి స్థానంలో రేగళ్లపాడు.. 12 శాతంతో చివరి స్థానంలో రేజర్ల
- ఇప్పటి వరకు 40శాతం కూడా దాటని వైనం..
- పంచాయతీల్లో కొరవడిన ప్రణాళిక



కాకర్లపల్లి పంచాయితీ కార్యాలయం

సత్తుపల్లిరూరల్: గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు గడువు ముంచుకొస్తోంది. పంచాయతీల నిర్వహణ పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 43రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ లోపు సత్తుపల్లి మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి రూ.92,201,272 లు వసూలు చేయాలి. కానీ ఇప్పటి వరకు 40 వరకు మించక పోవడం గమనార్హం. దీంతో పన్నుల వసూళ్లను ముమ్మరం చేసే పనిలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు ఉచితంగా సరఫరా అవుతుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగటంతో రెండేళ్ల నుంచి తాగునీటి పన్నుల వసూళ్ల నిలిచిపోయాయి.

అంతంత మాత్రంగానే పెండింగ్ బకాయిల వసూళ్లు..

2021–2022 ఆర్థిక సంవత్సరం పంచాయతీలలో వసూళ్లు చేయాల్సి ఇంటి పన్నుల బకాయిలు రూ.25,61,679లు ఉండగా.. ప్రస్తుతం వాటిల్లో ఈ ఏడాది రూ.57,1,679లు వసూళ్లు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.66,42,593లు వసూళ్లు చేయాల్సి ఉంది కానీ ఇప్పటి వరకు రూ.34,78,988 లు మాత్రమే వసూళ్లు చేశారు.

సత్తుపల్లి మండలంలోని తాళ్లమడ పంచాయతీ మాత్రమే గతేఏడాది 100శాతం పన్నులు వసూళ్లు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 77 శాతం వసూళ్లు అయ్యాయి. మిగతా 20 పంచాయతీలలో పాత బకాయిలో పెద్ద ఎత్తున పేరుకుపోయాయి.

50శాతంకు పైగా..

మండలంలోని ఇంటి పన్నుల వసూళ్లలో ఇప్పటి వరకు 50 శాతంకు పైగా ఉన్న పంచాయతీలలో రేగళ్లపాడు 90శాతం వసూళ్లు అయ్యాయి. తాళ్లమడ పంచాయతీ 77 శాతం, యాతాలకుంట పంచాయతీలో 70 శాతం, రామానగరం 57 శాతం, కాకర్లపల్లిలో 55 శాతం, రామగోవిందాపురంలో 53 శాతం చొప్పున వసూళ్లు అయ్యాయి. మిగతా 15 పంచాయతీలలో మాత్రం 50 శాతం పన్నుల వసూళ్లు దాటక పోవటం విశేషం. రేజర్ల పంచాయతీ 12 శాతం మాత్రమే పన్నుల వసూళ్లు కావటంతో అట్టడుగు స్థానంలో నిలిచింది. చెరుకుపల్లి, కిష్టాపురం పంచాయతీలో ఇంకా 30శాతం కూడా పూర్తి లేదు.

మిషన్ భగీరథతో..

మిషన్ భగీరథతో తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ప్రకటించిందని.. దీంతో మండలంలోని 21 పంచాయతీలలో ప్రజలు రెండేళ్లుగా తాగునీటి పన్నులు చెల్లించటం లేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు కలిసి జిల్లా అధికారుల దృష్టికి ఫోన్‌లో సమాచారం అందించగా.. పంచాయతీలలో నీటి పన్నులు వసూళ్లు చేయొద్దని నోటిమాటతో అధి కారులకు తెలియపర్చటంతో రెండేళ్ల నుంచి తాగునీటి పన్నులు పంచాయతీ సిబ్బంది నిలిపివేశారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి..



ఎక్కువ బకాయిలు నిలిచిపోయిన పంచాయతీలలో ఇంటి పన్నులు వసూళ్లు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.. ఈ ఏడాది ఆర్థిక సమయం ముగిసే సమయానికి వంద శాతం పన్నులు వసూళ్లపై దృష్టి పెట్టాం. ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి.

– సీహెచ్ సుభాషిణి, ఎంపీడీఓ, సత్తుపల్లి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..



ఇంటి పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇంటి పన్నులు చెల్లించాలని గ్రామస్తులకు వివరిస్తున్నాం.. ఇప్పటికే సుమారు 55శాతంకు పైగా పన్నులు వసూళ్లు అయ్యాయి.

– కంచర్ల రమాదేవి, సర్పంచ్, కాకర్లపల్లి

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యం



రైతు కూలీలకు వరంగల్ డిక్లరేషన్‌ను వివరిస్తున్న సంభాని చంద్రశేఖర్

తల్లాడ: రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. తల్లాడ మండలం కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం గ్రామాల్లో గురువారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంభాని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతీ గడపకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలను ప్రజలకు అందజేసి వరంగల్ డిక్లరేషన్‌ను వివరిస్తున్నట్లు తెలిపారు. కలకొడిమ గ్రామంలో మిర్చి తోటలో రైతులు, కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, పెద్ద బోయిన ప్రసాద్, కరిణ్, లక్ష్మారెడ్డి, వెంకటాచలపతి, వెంకటాచారి, వెంకటనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటమైబు, రామారావు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, ఎర్రుపాలెం, తక్కెళ్లపాడు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం బాబాకి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. బాబాని భక్తులు దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. మండలకేంద్రంలోని శ్రీసాయి నిలయంలో గుంటూరుకు చెందిన పల్లెల రాజా – మీనాక్షి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

దంపతుల అదృశ్యంపై కేసు

మధిర: మండలంలోని దెందుకూరు గ్రామానికి చెందిన గొల్లమండల వెంకటకృష్ణ – అపర్ణ దంపతులు ఈనెల 13 నుంచి కనరాకుండా పోయారు. దీంతో బంధువులు వారికోసం ఎక్కడ గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ ఎస్సై నరేష్ తెలిపారు.

ఘర్షణ.. ఒకరికి గాయాలు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మయ్య, కృష్ణ మధ్య తలెత్తిన భూ వివాదంలో ఘర్షణ పడి కొట్టుకోవటంతో లక్ష్మయ్యకు గాయలైనాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మయ్య, కృష్ణలకు గత కొంతకాలంగా భూ వివాదం ఉంది. లక్ష్మయ్య పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లగా కృష్ణ గొడవ పెట్టుకుని కొట్టడంతో లక్ష్మయ్యకు గాయాలైనాయి. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న రామకిషోర్ రెడ్డి

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడు గ్రామ సమీపంలో ఉన్న మధిర సబ్ రిజిస్టార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు గుంతలు తేలి ప్రమాదకరంగా ఉంది. ఈ సమస్యపై స్పందించిన మధిర సబ్ రిజిస్ట్రార్ శీలం రామకిషోర్ రెడ్డి రోడ్డు మరమ్మతులు చేయించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం జేసీబీతో రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి మట్టి తోలి గుంతలను పూడ్చి వేయించారు. అదే విధంగా కార్యాలయానికి పక్కన ఉన్న డొంక రోడ్డుకు కూడా మరమ్మతులు చేయించారు. కక్షిదారులతోపాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ శీలం రామకిషోర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కొణిజర్ల: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాణోత్ బాలాజీ, భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను నాయకులకు వివరించారు. ఈ నెల 25న కారేపల్లిలో జరిగే గిరిజన సంఘం జిల్లా మహాసభలలో నిర్ణయం తీసుకుని పోరాటానికి సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు తేజావత్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కల్లూరు: కల్లూరులోని శ్రీ షిరిడిసాయిరాం ధ్యాన మందిరం నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దీర్ఘకాలిక, స్వల్పకాలిక, సీజనల్ వ్యాధులు ఉన్న వారికి 200 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు నీలిమ, శ్రీనివాస్ నాయక్, ప్రవీణ్‌లు వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి నిర్వాహకులు బలరామ్, బావాజీ, మొరళి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మధిర: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మధిర పట్టణంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే, ఎర్రుపాలెం బీసీ బాలికల గురుకుల పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉడకని కూరలతో నీళ్ల చారు లతో మధ్యగతం విద్యార్థులు చాలీచాలని భోజనంతో అలమటిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఈ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

మైనింగ్‌ను నిలిపివేయాలి

పెనుబల్లి: మండలంలోని లింగగూడెం, గౌరారం రెవెన్యూ పరిధిలోని దేవతల గుట్ట వద్ద నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ క్రషర్‌లను నిలిపివేయాలంటూ లింగగూడెం ఆదివాసీలు గురువారం పెనుబల్లి తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. క్రషర్‌కు వాడే మెటల్ కోసం బాంబులు, జిలిటెన్‌స్టిక్స్ పెట్టి గుట్టను పేల్చుతున్నారని, దీనివల్ల సమీప ప్రాంతంలోని గృహాలు పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు.

గుడి పునఃనిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో గురువారం ముత్యాలమ్మ గుడి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోట్రు శ్రీనివాసరావు, ఎముక పాటి అప్పారావు, భద్రరావు, పోట్రు దర్గయ్య, అప్పయ్య, రోశయ్య, సత్యనారాయణ, మల్లిఖార్జునరావు, కృష్ణయ్య, ఎంపీటీసీ కనకయ్య పాల్గొన్నారు.

సాగర్ జలాలతో కట్లేరు నింపాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: సాగర్ జలాలతో కట్లేరును నింపాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు నీరు అందక కట్లేరు ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాల్లో చెరువులను కూడా సాగర్ జలాలతో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, బాబురావు, లక్ష్మణరావు, వెంకటనర్సయ్య, ఇస్మాయిల్, రాజేష్, జానీబాషా తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



చింతకాని: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న నారాయణ

చింతకాని: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేవరకు కృషి చేయాలని బాలాజీ ఎస్టేట్స్ సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ అలవాల నారాయణ, ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేటర్ మంగు రాజయ్య తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి, చినమండవ, మత్కేపల్లి ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షల సమయం వస్తున్నందున విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుతూ విజయం సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత, శ్రీనివాసరావు, మధుసూదన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ..

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శీలం వెంకటరెడ్డి పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, బాబురావు, లక్ష్మారెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన జెడ్పీ చైర్మన్



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర/ఎర్రుపాలెం/బోనకల్: మండలంలోని ఆత్కూరు మాజీ సర్పంచ్ అబ్బూరి రామకృష్ణ జ్ఞాపకార్థం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఆత్కూరు సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణి ప్రారంభించారు. ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రమ వైద్యశాల డాక్టర్ మనోరమ, ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు. ఇక ఎర్రుపాలెం మండలం జమలాపురంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ముల్పూరి స్వప్న, మొగిలి అప్పారావు, బానోతు రంగాతో పాటు ఏఎంసీ చావా రామకృష్ణ, ముల్పూరి శ్రీనివాసరావు, సగ్గుర్తి కిషోర్, షేక్ మస్తాన్‌వలీ, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, రామిశెట్టి సుజాత, పంబి సాంబశివరావు, కామిశెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో నిర్మించిన శివాలయంలో విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన గురువారం జరగగా జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు మల్లు నందిని తదితరులు పాల్గొని పూజలు చేశారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



కళ్ల అద్దాలు పెడుతున్న ఎంపీపీ హైమావతి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రామానగరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ కళావతిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు కంటి చూపుతో ఇబ్బందులు పడకూడదని, ఉచితంగా కంటి పరీక్షలు చేసి అనంతరం కళ్ల అద్దాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సులోచన, ఏఎన్‌ఎం సంధ్యారాణి, కార్యదర్శి వాసు, యాగంటి శ్రీనివాసరావు ఉన్నారు.

అమ్మపాలెంలో..

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ చిలుకూరి నాగేంద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు బాణోత్ అనూష, ఉపసర్పంచ్ భద్రమ్మలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, వైద్యాధికారి వినోద, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాధవరావు, వెంకటలాలయ్య, ఖాదర్‌బాబు, చిన్నరాములు, కృష్ణయ్య, సీతారాములు, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



మహాలక్ష్మికి చెక్కు అందజేస్తున్న లచ్చయ్య

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన పరిటాల మహాలక్ష్మికి గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సైదులు, లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు, చిన్న వెంకటేశ్వర్లు, లింగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని పెద్దమండవలో గురువారం రూ.60 వేలు విలువైన ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సిఫారస్ మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కును సూర్యనారాయణకు ఉపసర్పంచ్ నరసింహారావు అందజేశారు. కార్యక్రమంలో సుధీర్, వెంకయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు



సీఐ టి.సురేష్

వైరా: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో ఈ నెల 18 నుంచి జరగనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వైరా సీఐ తాటి పాముల సురేష్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు పొలాల్లో పార్కింగ్ చేసేందుకు గతంలో మాదిరి అవకాశం లేనందున పోలీసుల సూచనలు పాటించాలన్నారు. సిరిపురం మీదుగా లక్ష్మీపురం వచ్చే వారు సిరిపురంలోని పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపి స్టేజీ పినపాక, గండగలపాడు ద్వారా లక్ష్మీపురం వరకు ఏర్పాటు చేయనున్న ప్రైవేట్ బస్సుల్లో రావాలని సూచించారు. కాగా, జాతరకు నలుగురు ఎస్సైలు, పది మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, ముప్పై మంది కానిస్టేబుళ్లు, 15 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభిషేకం బల్ల బహుకరణ

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల విగ్రహాలకు అభిషేకం చేసేందుకు గురువారం భక్తులు ఆదిరాజు రాధమ్మ, రంగారావు దంపతుల కుమార్తె అన్నపూర్ణ రూ.16 వేలు విలువ చేసే అభిషేకం బల్లకు టేకు ఇత్తడి చేయించి బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ రామారావు, ఉపసర్పంచ్ రామకృష్ణ, ఈఓ ఎస్.శ్రీనివాస్, ఆలయ అర్చకుడు కె.చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం పంపిణీ

చింతకాని: వినికిడి లోపంతో బాధపడుతున్న మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పావులూరి మనస్వినికి ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా బద్వేల్‌కు చెందిన రాయదూగం శ్రీధర్‌శాస్త్రి అందజేసిన వినికిడి యంత్రాన్ని ఐఈఆర్పీ కేఏస్ కృష్ణారావు గురువారం పంపిణీ చేశారు.

భద్రమ్మకు డీసీసీబీ చైర్మన్ నివాళి

కారేపల్లి: మండలంలోని లింగంబంజర గ్రామానికి చెందిన పురం భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా.. గురువారం లింగంబంజర గ్రామంలో భద్రమ్మ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం హాజరై భద్రమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భద్రమ్మ కుమారులు పురం నారాయణ, పురం వెంకన్న లను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రోషయ్య, సొసైటీ డైరెక్టర్ ఉపేందర్, అంజన్‌కుమార్ యాదవ్, ఎర్రబెల్లి రఘు, అరుణ్‌కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి ప్రాథమిక పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థినికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ట్రెయినీ కలెక్టర్, ఎంపీడీఓ రాధిక గుప్తా చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు దయాకర్ రూ.5 వేలు, మిగిలిన ఉపాధ్యాయులు అందరూ కలిసి రూ.5 వేలు మొత్తం రూ.10 వేలను అందించినట్లు వివరించారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ మాట్లాడారు. సర్కారు బడుల్లో అత్యున్నత స్థాయి విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. హెచ్‌ఎం డి. సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ సలీం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర చిత్రపటాలకు పాలాభిషేకం

తల్లాడ: మండలంలోని పినపాకలో సీఎం కేసీఆర్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. పినపాకలో ఎస్సీ కమ్యూనిటీ హాలుకు రూ.25 లక్షలు, బీసీ కమ్యూనిటీ హాలుకు రూ.25 లక్షలు మంజూరు చేసినందుకు వారి చిత్రపటాలకు సర్పంచ్, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యం, ఉప సర్పంచ్ రామిరెడ్డి, జమలయ్య, నరసింహారావు, ఆదాం, భూషణం, వేలాద్రి, శశికుమార్, వేణు, కార్తీక్, మురళీ పాల్గొన్నారు.

నేడు డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రారంభం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వేశ్యాకాంతల చెరువుల పక్కన ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభిస్తారని తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాడిరైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: హెరిటేజ్ పాలసేకరణ కేంద్రంలో పాడి రైతులకు, పశుపోషణ, పాలసమృద్ధి, పాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. హైదరాబాద్ రీజనల్ హెడ్‌ఏ బి.నర్సింగరావు సదస్సులో పాల్గొని పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ సతీష్‌రెడ్డి, కల్లూరు ప్రోక్యూర్ మెంట్ మేనేజర్ అశోక్ మాట్లాడారు. పాడి రైతులకు ఉచిత భీమా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడిరైతులు, సూపర్ వైజర్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.